# అభివృద్ధిలో దూసుకుపోతున్న 'మనూరు'

- నూతన సీసీ రోడ్డు నిర్మాణంతో తీరిన ఇబ్బందులు
- రోడ్డు పక్కన తోరణాలుగా దర్శనమిస్తున్న చెట్లు



మనూరులో రైతు వేదిక కేంద్రం

మనూరు, అక్టోబర్ 12 : మనూరు ఉమ్మడి రాష్ట్రంలో అతిపెద్ద మండలం అయినప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేది. కనీస వసతులు కూడా లేక రవాణా సౌకర్యాలు సక్రమంగా లేక మండల కేంద్రానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీస వసతులు కల్పించాలని పలుమార్లు ప్రజలు కోరినప్పటికీ ప్రజల బాధలు పట్టించుకున్న నాథుడే లేడని పలు గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. గతంలో కనీసం మండల కేంద్రానికి వెళ్లాలన్నా కూడా వాహనాలు వెళ్లే పరిస్థితులు ఉండేవి కావు. కనీసం కాలినడక వెళ్లే పరిస్థితులు కూడా ఉండేవి కావు. నూతనం రాష్ట్రం ఏర్పడ్డాకా మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులు జోరందుకున్నాయి.

**మండల కేంద్రానికి డబుల్ రోడ్డు**

మండల కేంద్రంగా కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్, రైతు వేది క, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తహసీల్దార్ కార్యాలయం, గ్రామ పంచాయతీలతో పాటు పాఠశాలలు కూడా ఒకే దారి కి ఉండటంతో ప్రభుత్వం ప్రత్యేకనిధులు కేటాయించింది. నూతనంగా డోవూర్ బీటీ రోడ్డు నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు డబుల్ లైన్ సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ. 45లక్షలు మంజూరు చేయడంతో పాటు పనులు కూడా పూర్తి అయ్యాయి. దీంతో పాటు మనూరు ప్రధాన రహదారి నుంచి అంగన్‌వాడీ భవనం వరకు రూ. 5లక్షల సీసీ రోడ్డు నిర్మించారు. అంతేకాకుండా కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం రూ. 5లక్షలు, చర్చి ప్రహరీ నిర్మాణం కోసం రూ. 10లక్షలు మంజూరు చేసింది. నారాయణఖేడ్ నియోజకవర్గానికి 9కిలో మీటర్ల దూరం ఉన్న మనూరు మండల కేంద్రం నేడు అభివృద్ధిలో దూసుకుపోతున్నది.

**రోడ్డు ఇరుపక్కలా పచ్చని చెట్లు**

రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటడంతో రోడ్డు ఇరుపక్కల తోరణాలుగా దర్శనమిస్తున్నాయి. నేడు మండల కేంద్రంతో పాటు తహసీల్దార్ కార్యాలయం, ఐకేపీ కార్యాలయం, వద్ద కూడా అధిక సంఖ్యలో మొక్కలు నాటారు. ఐకేపీ కార్యాలయం వద్ద జామ, మామిడి, సపోట పలు రకాల పండ్ల మొక్కలు నాటారు.


రోడ్డుకు ఇరు పక్కలా ఏపుగా పెరిగిన చెట్లు

**సీసీ రోడ్డుతో తీరిన ఇబ్బందులు**



మండల కేంద్రానికి గతంలో వెళ్లాలంటే ఇబ్బందులు ఉండేవి. వర్షాకాలం అయితే అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చొరవ చూపి నిధులు మంజూరు చేయడంతో అభివృద్ధి జోరందుకుంది. నేడు మండల కేంద్రం వెళ్లాలంటే ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా వెళ్తున్నాము. సీసీ రోడ్డుతో పాటు గ్రామంలో పలు అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నా యి. నూతన రాష్ట్రం ఏర్పాడ్డ తరువాతనే మండల కేంద్రం అభివృద్ధి చెందుతున్నది.

– మలేశ్ (మనూర్)

## స్టడీ సర్కిల్‌కు భవనం కేటాయిస్తాం

సంగారెడ్డి, అక్టోబర్12: దివ్యాంగులకు స్టడీ సర్కిల్ నిర్వహణకు ప్రభుత్వ భవనాన్ని కేటాయిస్తామని, దివ్యాంగుల వినతిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతాప్రభాకర్ భరోసా ఇచ్చారు. గురువారం క్యాంపు కార్యాలయంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక నియోజకవర్గ కమిటీ సభ్యులు ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ స్పందించి భవన కేటాయింపునకు తనవంతు కృషి చేసి సహకరిస్తానన్నారు. త్వరలో అందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భవనాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అడివయ్య, అధ్యక్షుడు మాణిక్, జిల్లా అధ్యక్షుడు గోపాల్, కార్యదర్శి బస్వరాజ్ పాల్గొన్నారు.


చింతాప్రభాకర్‌కు వినతిపత్రం అందజేసిన నాయకులు

## రాష్ట్రస్థాయి క్రీడలకు బొల్లారం విద్యార్థులు ఎంపిక

బొల్లారం, అక్టోబర్ 12: బొల్లారం మున్సిపాలిటీలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. గురువారం ఎంపికైన విద్యార్థులను ఆమె అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కప్ అండర్–19 కబడ్డీ, కోకో క్రీడల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు మండలస్థాయి నుంచి జిల్లా స్థాయికి, ఆపై రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్టు తెలిపారు. కబడ్డీ బాలుర విభాగంలో శశివర్ధన్, బిక్కి, బాలికల విభాగంలో ఆర్తి, నేహలు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 17వ తేదీన సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీడీ శశిరేఖ, ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.


ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఆదర్శ పాఠశాల విద్యార్థులతో ప్రిన్సిపాల్ శైలజ, పీడీ శశిరేఖ

## శనిఘాట్‌లో శని అమావాస్యకు ఏర్పాట్లు

ఝరాసంగం, అక్టోబర్12 : శని అమావాస్యని పురస్కరించుకొని శనీశ్వరుడి ఆలయం ముస్తాబు అవుతున్నది. గురువారం మండలంలోని ఏడాకులపల్లి గ్రామ శివారులో ఉన్న సప్తపురి శనిఘాట్ శనీశ్వరాలయంలో శని అమావాస్య వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమి టీ సభ్యులు మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాతో పా టు కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు తరలివస్తారన్నారు. శని అమావాస్యని పురస్కరించుకొని ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు కొనసాగుతాయన్నారు. పూజా కార్యక్రమంలో భాగంగా ఆలయ ఆవరణలో నిత్యపూజలతో పాటు శని మహాయజ్ఞం,1108 కలశములతో తైలాభిషేకం, భక్తులే స్వయంగా అభిషేకం చేసుకునే సౌకర్యం కల్పించామన్నారు. శని అమావాస్యని పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం వితరణ చేస్తున్నట్లు తెలిపారు.


శని మహాత్ముడు

# ఘనంగా బతుకమ్మ సంబురాలు


ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బొల్లారం, అక్టోబర్ 12: బొల్లారం మున్సిపాలిటీలోని పలు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మ సంబురాలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ ఆదర్శ పాఠశాలలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ శైలజ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులు బతుకమ్మలను ముస్తాబు చేసి ఆడిపాడారు. అనంతరం స్థానిక చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లలిత, పీడీ శశిరేఖ పాల్గొన్నారు.

**బతుకమ్మ సంబురాలు**

జిన్నారం, అక్టోబర్ 12 : మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలో గురువారం బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. రంగు రంగుల పువ్వులతో విద్యార్థులు బతుకమ్మ చేశారు. పాఠశాల ఆవరణలో బతుకమ్మ పెట్టి విద్యార్థులందరూ కలిసి బతుకమ్మ పాటలపై నృత్యాలు చేశారు. అనంతరం చెరువులో బతుకమ్మలను వదిలారు.

**ఆర్సీపురంలో 21న బతుకమ్మ వేడుకలు**

రామచంద్రాపురం,అక్టోబర్12: ఆర్సీపురంలో ఈ నెల 21న బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ పుష్పానగేశ్ తెలిపారు. గురువారం ఆర్సీపురంలోని హనుమాన్ ఆలయంలో బతుకమ్మ, దసరా వేడుకల నిర్వహణపై గ్రామపెద్దలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ పూజారి కిషన్ పంతులు సూచనల మేరకు శనివారం 21న సాయంత్రం సండే మార్కెట్‌లో బతుకమ్మ వేడుకలు, 23న సండే మార్కెట్‌లో రావణ దహనకాండను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్కిల్ అధ్యక్షుడు పరమేశ్, డివిజన్ అధ్యక్షుడు గోవింద్, లక్ష్మణ్, కరికె సత్యనారాయణ, సోనుగౌడ్, నవీన్‌గౌడ్, ఐలేశ్, మల్లేశ్, బేకు యాదయ్య, కుమార్ పాల్గొన్నారు.


బతుకమ్మ, దసరా వేడుకలకు సంబంధించిన పత్రికను కార్పొరేటర్ పుష్పానగేశ్‌కు అందజేస్తున్న పూజారి కిషన్

## నేటి నుంచి గురుకులంలో జోనల్ క్రీడలు

జిన్నారం, అక్టోబర్ 12 : జిన్నారం గిరిజన గురుకుల పాఠశాలలో శుక్రవారం నుంచి ఏడవ జోనల్ లెవల్ క్రీడలు ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే క్రీడలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ క్రీడల్లో మహబూబ్‌నగర్, వనపర్తి, రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వికారాబాద్ జిల్లాలలోని 14 గిరిజన గురుకులాల నుంచి సుమారు 650మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. క్రీడల ప్రారంభోత్సవానికి కలెక్టర్ శరత్‌కుమార్, గురుకులాల కార్యదర్శి నవీన్‌నికోలస్ హాజరవుతారని ప్రిన్సిపాల్ తెలిపారు.

## కొనసాగుతున్న 'సంపూర్ణ ఆరోగ్య సురక్షా'

బొల్లారం, అక్టోబర్ 12: బొల్లారం మున్సిపాలిటీలో సంపూర్ణ ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోంది. గురువారం కొత్త బస్టాండ్ ఆటో యూనియన్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో స్థానికులకు హెచ్ఐవీ, బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ రెండు దఫాలుగా పరీక్షలు చేసి అనంతరం వాటి రిపోర్టుల ఆధారంగా మందులను పంపిణీ చేస్తామన్నారు. ఆరోగ్య భద్రతపై సూచనలు సలహాలను ప్రాజెక్టు మేనేజర్ ఉప్పలయ్య అందించారు. కార్యక్రమంలో సురక్ష కార్యక్రమ ఆరోగ్య కార్యకర్త, జెండర్ కమిటీ సభ్యురాలు శారద, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.